# చీమలు పెట్టిన పుట్టలు

ఉదయం పది గంటలు కావస్తున్నది. వీరభద్రుడు ఇంకా రాలేదు.

బోనులో వేళకి తిండి పడని పులిలా వీధి వరండాలో పచార్లు చేస్తున్నాడు పెద్ది పంతులు. క్షణక్షణానికీ వరండా అంచుల్ని దాటి ముందుకొస్తున్న ఎండలాగే అతడి కోపం కూడా ముదురుకొస్తున్నది.

"అక్కడి దాకా వచ్చిన వాడు ఇంట్లోకి రాకుండా ఆగి పోతాడేమిటి? లోపలి కొచ్చి కూర్చోండి" అంది సుబ్బలక్ష్మి.

అన్నం వేళకి బావమరిది రాలేదని అసలే లోలోపల ఉడికిపోతున్న పెద్దిపంతులికి పెళ్లాం మాట పుండుపై కారం జల్లినట్లు అయింది.

"ఆ వస్తాడు.... వస్తాడు... రాడూ?... ఈనాటికి వీడి అసరం పడి వసుదేవుడు గాడిద కాళ్లు పట్టుకొన్నట్లు 'నాయనా, బాబు' అంటే కొండెక్కి కూర్చున్నాడు. చచ్చి ఏ లోకాన ఉన్నాడో గోపాలం.... వాడే బ్రతికి ఉంటే నాకు యిటువంటి తంటా తెచ్చి పెట్టేవాడా? నిజంగా నా కుడిభుజం లాంటివాడు వాడు. ఆ పాడు జ్వరం వాడిని పొట్ట పెట్టుకోడం వల్ల ఈ వీరభద్రుడు. గీరభద్రుడు కావలసి వచ్చింది కాని.... లేకుంటేనా.....?"

"గోపాలం నాకు ఎలా తోడ పుట్టినవాడో వీడూ అంతేకదా? కాదంటే వాడు పనీపాటా లేకుండా ఉండేవాడు. మీరు ఏకాకి చేత కబురు పెట్టినా రాత్రనక పగలనకా రెక్కలు కట్టుకుని వచ్చి వాలేవాడు. వీడిది తలమ్ముకొన్న బ్రతుకాయె... వాడిలా వీడికెలా తీరుతుంది?"

"ఆ... అమ్ముకొన్నాడు బోడి తల. రెండు పూటలా ఇంట్లో వాళ్ల తిండికైనా చాలని జీతానికి.... ఎలాగైతేనేమి సంపాదించాడులే మహదొడ్డ నౌకరి..."

తన వారిచేత నౌకర్లలా చాకిరీ చేయించుకొంటూ, మళ్లా ఇటువంటి మాటలు అనడం సుబ్బలక్ష్మి సహించలేకపోయింది. తన తమ్ముడిని బోడితల అని తిట్టడంతో ఆమెకి ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది.

"ఇదిగో మీకే చెపుతున్నది. నా తమ్ముడిని బోడి గీడి అంటే ఊరుకొనేది లేదు. మీలా వారికి ఆస్తి పాస్తులు లేకపోతే లేకపోయె.... మీకన్న వెయ్యి వ్యవహారాలు చేసే నేర్పు వారికి ఉంది. ఏదీ మీ పస? ఎంత సేపూ నా మీదా నా వాళ్ల మీదా ఎగిరిపడటమే కాని.., పట్నం వెళ్ళి మీ పని స్వయంగా చేసుకురాగలుగుతున్నారూ! నువ్వా నువ్వా అంటూ అందర్నీ బ్రతిమాలు కొంటూ తిరక్కపోతే హాయిగా వెళ్లి ఆ పని పాట్లు ఏవో చూసుకు రాకూడదూ చేతనైతే..."

భార్యామణి 'సవాల్' పెద్దిపంతుల్లో అహంకారాన్ని లేవగొట్టింది.

"ఎందుకు చెయ్యలేను? మహరాజులా చేసుకు రాగలను. సొమ్ముతో కూడిన పని..... ఒంటరిగా వెళ్ళి రావడం మంచిదికాదని చూస్తున్నా కాని లేకపోతే పట్నం వెళ్లి బ్యాంకులోంచి డబ్బు తీసుకు రావడం అదొక ఘనకార్యమా? ఇక్కడ ఎవరూ గాజులు తొడిగించుకొని కూర్చోలేదు" అంటూ భార్య మీద ఎగిరిపడ్డాడు. ఊరకే ఎగిరిపడ్డమే కాకుండా ఆ రోజు తను స్వయంగా పట్నం వెళ్లి పని చేసుకు రావాలని కూడా తీర్మానించుకున్నాడు.

భార్య ముందు లోకువ కాకూడదని అలా బీరాలు పలికాడేకాని అంతవరకు పెద్దిపంతులు బ్యాంకు ముఖం చూసింది లేదు. బ్యాంకులో సొమ్ము ఎలా వేస్తారో ఎలా తీస్తారో ఆ సంగతులేవీ అతడికి తెలియవు.

ఈ మాట చెప్తే అతన్ని, అతడి సిరిసందపల్ని చూసినవారు ఎవరూ నమ్మరు. ఏదో తమాషాకి అంటున్న మాట అనుకొంటారు. గ్రామంలో సగానికి పైగా పొలాలు హక్కు భుక్తంలో ఉన్న భూస్వామి. ఎంత లేదన్నా సంవత్సరానికి పాతిక, ముప్పయి వేలకి పైగా డబ్బు కళ్ళ చూసే కామందు తన పేర, భార్య పేర అనేక రకాలైన ఎకౌంట్లు బ్యాంకుల్లో ఉన్న పెద్దమనిషి అంతవరకు బ్యాంకు ముఖం చూడలేదన్నా, ఒక్క చెక్ మీద నైనా సంతకం పెట్టి సొమ్ము తీసుకోలేదన్నా ఆ ఊరివాళ్లు, అతడి తత్వం తెలిసిన వాళ్ళు మాత్రమే నమ్ముతారు.

పెద్ది పంతులికి బ్యాంకులతో ఉన్న వ్యవహారం అంతా 'వన్ వే ట్రాఫిక్' లాంటిది. ఎప్పుడూ అతడి ఎకౌంటులో జమలే కాని, ఖర్చులు ఉండవు.

ఆ లావాదేవీలైనా నెల రోజుల క్రిదటి వరకు పెద్ద బావమరది గోపాలం చూసుకొంటూ ఉండేవాడు. ఒక విధంగా అతడు పెద్ది పంతులకి పెర్సనల్ సెక్రెటరీ అని చెప్పవచ్చు. నెల రోజుల నాడు అతడు ఒక్కరోజు జ్వరంతో హరీమనడం, ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్న కూతురి పెళ్ళి సంబంధం స్థిరపడ్డం రెండు రోజుల తేడాతో జరిగిపోయాయి.

నలుగురు మొగపిల్లల తరువాత ఒక్కగానొక్క ఆడపిల్ల. కూతురి పెళ్ళి ఘనంగా చెయ్యాలంటుంది భార్యారత్నం. కట్నకానుకలు, నగానట్రా అన్నిటా ఒకరు వేలెత్తి చూపలేని విధంగా వివాహం జరిపించాలని ఆవిడ కోరిక. ఆ ఏడు వచ్చిన పంటల సొమ్ముతో కూతురి పెళ్ళి జరిగిపోతే బాగుండును అని పెద్దిపంతులు అభిలాష.

మగాడు ఎన్ని కబుర్లు చెప్పినా ఇటువంటి శుభకార్యాలు ఇళ్ళలో జరిగే సందర్భాలలో ఆడవారి మాట చెల్లుబడి అవడం సాంప్రదాయం. పైగా తమ కట్నాల పేరుతో పుచ్చుకొన్న డబ్బు బ్యాంకు లోంచి తీసి చెల్లెలి పెళ్ళి ఘనంగా జరిపించాలని అని ఎక్కడెక్కడో ఉద్యోగాల మీద ఉన్న కొడుకుల ఒత్తిడి ఒకటి.

అటు కొడుకుల ఆదేశాలు, ఇటు ఇంటావిడ ఈసడింపులు, ఇరుగు పొరుగుల వ్యాఖ్యానాలు భరించలేక చివరికి తెగించి ఒక పాతిక వేల రూపాయలు బ్యాంకు నుండి తీసి కూతురుకు నగ నట్రా చేయించాలనే నిర్ణయానికి వచ్చాడు పెద్దిపంతులు.

ఆ రోజు శనివారం. రెండో పూట బ్యాంకులు ఉండవు. మరునాడు ఆదివారం, సోమవారం సంవత్సరాది శెలవు రోజు. మంగళవారం పూట కంసాలి వాడికి బంగారం కోసం బయానా ఇవ్వడం పెద్దిపంతులికి ఇష్టం లేదు. బుధవారం నాడు తిథీ, అమ్మడు నామ నక్షత్రానికి సరిపడదు. ఇంక లక్ష్మీవారం చవితి. ఏ పనికి వీలుకాదు. శుక్రవారం సరేసరి.... ప్రాణం పోతున్నా పెద్ది పంతులు ఒక్కపైసా అయినా చెయ్యి దాట నివ్వడు.... మళ్ళా శనివారం.

అందుకే ఆ రోజు అన్న విధంగా బావమరది రాలేదని అంతలా గింజుకొంటు న్నాడు. తెల్లవారేసరికి మీ గుమ్మంలో ఉంటానని అన్ని కబుర్లు చెప్పిన వీరభద్రుడు పదిదాటినా రాలేదు. పెద్దిపంతులు బావమరిదిని మనసులో తిట్టుకొంటూనే అలా గుమ్మంలో పచార్లు చేస్తూ ఉండగా గోడ గడియారం ఒక గంట కొట్టింది. అది అరగంట కామోసు అనుకొని 'అప్పుడే పదిన్నర అయిందా' అని అతడు అనుకోబోయేంతలో తాతలనాటి పాత గడియారానికేం రోగం ముంచుకొచ్చిందో వరుసగా మరో పది గంటలు కొట్టి ఏమీ ఎరగని నంగనాచిలా పెద్దిపంతులు వైపు చూస్తూ ఊరుకొంది.

"అయ్యో.... అయ్యో... అప్పుడే పదకొండు. వీడికేం పోయే కాలం తన్నుకొచ్చింది? తెల్లవారేసరిక వస్తాన్న మనిషి పదకొండు కొట్టినా వచ్చి చావడేం?"

భర్త స్వగతం విని వంట ఇంటిలోంచి బయటికి వచ్చింది సుబ్బలక్ష్మి.

"మీరింకా ఇక్కడే వున్నారా? అరగంటగా మీ అరుపులు, పెడబొబ్బలు వినిపించకపోతే ఇంకా బస్సుకి కాని వెళ్ళారేమో అనుకున్నాను."

"దేనికి? మీ తమ్ముడికి స్వాగతం పలకడానికా?"

"వాడికి స్వాగతం మీ రెందుకు పలుకుతారులెండి. కాకపోతే పనంతా చేయించు కొని వెధవపని బోడి పని అంటూ తిట్టిపోస్తారు కాని. అయినా ఇన్ని కబుర్లు చెప్పేవాళ్లు.... ఆపాటి పని చేసుకురాలేరూ?" అంది భార్యారత్నం ఎత్తిపొడుపుగా. అతడు అంతకు పూర్వం ఇటువంటి వ్యవహారాలు చెయ్యలేదనీ, చెయ్యలేడనీ కూడా సుబ్బలక్ష్మికి తెలుసు. భర్త తన వారిని పట్టుకు తిట్టాడన్న అక్కసు తీర్చుకోడానికే ఆ మాట అంది.

భార్య ఎత్తిపొడుపుతో పౌరుషం పొడుచుకొచ్చిన పెద్దిపంతులు ఇంక వెనకా ముందూ చూడకుండా చిలక్కొయ్యకి తగిలించి ఉన్న వాణి తీసుకుని భుజం మీద వేసుకొని, చేతికర్ర అందుకొని, చెక్ పుస్తకం పెన్ను సంచిలో ఉన్నాయో లేవోని సరిచూసుకొని, "ఇదిగో.... నే వెళుతున్నా, మీ తమ్ముడు వస్తే ఆ తలని మరి నలుగురికి అమ్ముకోమను. నా పని కోసం మానుకో నక్కరలేదు" అంటూ ఒక గావు కేక పెట్టి, బస్సుస్టాండు వైపు చర చర అడుగులు వెయ్యసాగాడు.

అంతవరకు అతడి రాక కోసమే వేచి ఉన్నట్లు స్టాండులో నిలిచి వున్న బస్సు ఎదురు వచ్చింది. అనుకొన్న వెంటనే బస్సు అందడం అదొక శుభ సూచనగానే అనిపించింది పెద్దిపంతులుకి.

"పంతులుగారు.... పట్టణానికే నేంటి ప్రయాణం?" అని ప్రశ్నించాడు వెనుక సీటులో కూర్చున్న వెంకన్న.

'అడిగేవూ శకునపక్షీ' అని వాడిని మనసులో తిట్టుకొంటూనే, "మరేరా" అన్నాడు పెద్దిపంతులు హుందాగా మందిని తప్పించుకొంటూ, కండక్టర్ తన కోసం ఖాళీ చేయించిన ముందు సీటువైపు కాలు కదుపుతూ.

భార్య అలా ఎత్తి పొడిచింది అని ఉక్రోషంతో బయలుదేరాడే కాని బస్సు పట్నం దిశగా ప్రయాణిస్తుంటే పెద్దిపంతులు గుండెలు పీచు పీచు మనసాగాయి. తను ఏనాడు బ్యాంకు ముఖం చూసింది లేదు. పైగా తెచ్చుకోవలసిన సొమ్ము కాణీ పరకా కాదు. పాతిక వేల రూపాయలు. తన ముఖం ఎన్నడూ చూడని బ్యాంకు వాళ్ళు అంత సొమ్ము ఒక్కసారిగా ఇస్తారో లేదో, అని కంగారుపడ్డాడు. మళ్ళా అంతలోనే ఎవడి బాబు కోసం ఇస్తారు? తన సొమ్ము తీసుకుంటున్నాడు కాని ఊరు వాళ్ళది కాదుగా, కావాలంటే వరసగా వంద సంతకాలు పెట్టి వాళ్ళ దగ్గర వున్న సంతకంతో పోల్చి చూసుకోమంటాడు. అనుమానాన్ని పక్కకి నెట్టి తనకి తనే ధైర్యం చెప్పుకొన్నాడు.

పోనీ, ఈ వెంకన్నకి బ్యాంకులు వగైరా పట్నం పోకడలు బాగా తెలుసు. దావాలకని, తంటాలకని తరుచు వెళ్ళి వస్తుంటాడు. కోరీ కోరనట్లు ఎదురు పడ్డాడు. అతన్ని కాస్త సాయం చేసిపెట్టమంటే పని సులువుగా జరిగిపోతుంది. ఓసారి అటు వెళ్ళి అడిగిరానా అనుకొన్నాడు.

కాని, అంతలోనే భార్యామణి అన్న ఎత్తిపొడుపు మాటలు గుర్తుకు వచ్చాయి. తన అన్నదమ్ముల సహాయం లేకపోతే తను ఒంటరిగా పట్నం పోయి సొమ్ము తెచ్చుకోలేడు అన్నట్లు మాట్లాడింది. ఇప్పుడు ఈ వెంకన్నని సహాయం కోరితే ఈ విషయం ఎలాగోలాగ దాని చెవిదాక చేరక మానదు. అదే జరుగుతే యింక తను సుబ్బి ముందు తలెత్తుకొని తిరగలేడు. బ్రతికున్నంత కాలం ఈ విషయాన్ని ఎత్తి చూపి దెప్పి పొడుస్తూనే ఉంటుంది. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనుక చచ్చినట్లు ఈ పెద్దిపంతులు బ్రతుకులో పెళ్లాం ముందు లోకువ కావడమా? అంతకన్న ఏ గంగలోనో దూకి ఆ గుక్కెడు ప్రాణం వదులుకోవడం మేలు....

పెద్దిపంతులు ఆలోచనల్లో పడి అలా కొట్టుకుపోతుండగానే ఆ వెంకన్న ఏ గ్రామంలోనో చల్లగా దిగబడ్డాడు. పట్నంలో బస్సు ఆగేసరికి అతడు తన సీట్లో లేడు.

నోరు విడిచి అడిగేందుకన్నా వెంకన్న అక్కడ లేడు, అన్న విషయం తేలిపోగానే అందని ద్రాక్షలు పుల్లన అనే తత్వంలోకి దిగిపోయింది పెద్దిపంతులు మనసు.

బోడి సహాయం వాడు చేసి పెట్టేదేముంది? హాయిగా బస్సు స్టాండులో దిగగానే ఒక రిక్షా మాట్లాడుకొంటే తీరిపోతుంది. ఫలానా బ్యాంకిరా అంటే వాడే తీసుకు పోతాడు. ఇంక అక్కడికి చేరాక.... ఆ బ్యాంకులోనే ఎవరినో ఒకరిని పట్టుకొని పని పూర్తి

చేసుకురావచ్చు. 'ఇదిగో ఏ మమ్మాయి సుబ్బలక్ష్మీ! మీ ఆయనకి మేము సహాయం చేసాము, చెక్కు రాసి పెట్టాము' అని ఈ ఊరు నుంచి పని కట్టుకొని నర్సాపురం వెళ్ళి వాళ్ల భార్యతో చెప్పబోరుకద....

పెద్దిపంతులు ఆసించినట్లే బ్యాంకులో వుద్యోగులు అతడికి చాలా సహాయం చేసారు. ముఖ్యంగా అతడితోపాటే ఆ బ్యాంకులో కాలు పెట్టిన వ్యక్తి. అతడి పేరు రామనాథంట. ఆ ఊళ్ళో పుస్తకాల షాపు ఉందట. చాలా చాలా సాయం చేసాడు. నిజానికి పెద్దిపంతులుకి చెక్ రాసిపెట్టింది, ఎక్కడ ఎలా సంతకం పెట్టాలో ఎలా సొమ్ము తీసుకోవాలో, అన్నీ అతడే చెప్పి పెట్టాడు.

"ఇంత సొమ్ము ఒక్కసారి తీస్తున్నారు ఏదైనా పొలం పుట్రా కొంటున్నారా లేక ఇంట్లో పెళ్ళీ పేరంటంలాంటి శుభకార్యం ఉందా?" అంటూ ఎంతో కలుపుగోరుగా పలకరించాడు.

"మీరు అన్న రెండో విషయమే. మా అమ్మాయికి వచ్చే నెలలో పెళ్ళి, వాళ్లన్ని ఏదో నగా నట్టు చేయించాలని అంటుంటే.... ఒక్కగా నొక్క ఆడపిల్ల...."

"కాదూ మరీ, మీ వంటి భూకామందులు పిల్లకి పెట్టక పోతే మావంటి అణా పైసలు చూసుకొనే వాళ్ళం పెట్టగలమా" అన్నాడు పొగడ్తగా.

దానితో పెద్దిపంతులు తన ఊరు, ఇల్లు, భూవసతీ, కొడుకుల ఉద్యోగాలు, పై ఆర్జనలు, వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు, తీసుకొన్న కట్నాలు, కోడళ్ళకు పెట్టిన బంగారాలు, అన్నీ వివరంగా వర్ణించి చెప్పసాగాడు.

"ఓహో... ఆహో... ఎంత అదృష్టం! వడ్డించిన విస్తరివంటి జీవితం అంటే మీదే... ఈ జన్మలో ఇంత అనుభవించేందుకు ముందు ఏ జన్మలో పెట్టి పుట్టేరో" వంటి మాటల్ని సందర్భోచితంగా వాడుతూ సంభాషణ సాగించాడు రామనాథం.

పెద్దిపంతులు చెక్కు మార్చుకోడం, రెండు వందల ఏభై నూరు రూపాయల నోట్లని ఒకటికి రెండుసార్లు లెక్కపెట్టుకొని, పదిలంగా కాగితం కవరులో పెట్టి సంచిలో పెట్టుకోడం వగైరా పనులన్నీ సవ్యంగా జరిగిపోయాయి.

మూతి మీదలేని మీసాల్ని కుడిచేత్తో హుందాగా మెలిపెడుతూ, "హూ! ఏమను కొన్నారో... ఈ పెద్దిపంతులు అంటే" అనుకున్నాడు గర్వంగా. తెల్లముఖం వేసుకు చూస్తున్న భార్య, ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టిన బావమరది అతడి కళ్ల ముందు కదలాడారు.

ఏడవలేక పోయారు వెధవలు... కోడి కొండెక్కి కూర్చుంటే ఊరు తెల్లవారడం మానుతుందా? ఎవరో ఒకరు చేస్తున్నారు కదా ఎందుకొచ్చిన బెడద అని కాని.... లేకుంటే ఆపాటి పట్నం వెళ్లి బ్యాంకులోంచి సొమ్ము తచ్చుకోలేకనా? ఈ పెద్ది పంతులు అంత చేతకానివాడే అయితే ఇంత ఆస్తిని ఎలా పెంచాడు? ఇన్ని వ్యాపారాలు, వ్యవహారాలు, పెళ్ళిళ్లు, పేరంటాలూ, ఇవన్నీ ఎలా చేసుకొచ్చాడు...?

"మీరు ఇక్కడే నగలు కొనాలనుకుంటే నాకు తెలిసిన ఒక బంగారు వర్తకుడు ఉన్నాడు. అతడి షాపులో అన్ని రకాల నగలు ఉంటాయి" అన్నాడు రామనాథం.

"అబ్బెబ్బె.... అలా చేసిన నగలు కొనడం మాకు అలవాటు లేదండీ! వాటిలో పేరుకి బంగారం, ఉండేది రాగి. నేను ఏ నగ చేయించినా మా ఇంటి కంసాలి బంగారయ్య పట్నం వచ్చి పాత బంగారం కొని, దానితో చెయ్యవలసిందే. ఈ కాసు బంగారం, కేసు బంగారం నాకు నచ్చవు" అన్నాడు పెద్దిపంతులు.

"అదే మంచిది లెండి. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మటానికి లేదు. ప్రతి దానికీ ఇమిటేషన్లు. అసలు వస్తువు ఏదో నకిలీ ఏదో పోల్చుకోలేక చస్తున్నామనుకోండి. అయితే మరి నేవెళ్లాను. మీరు తిన్నగా మీ ఊరికేనా... లేక...."

"అ బ్బె బ్బె... ఇంత సొమ్ము చేతిలో ఉంచుకొని ఇంక ఈ పట్నంలో ఒక్క నిముషం ఉండను. వెంటనే బస్సు స్టాండుకి వెళ్ళి అందిన మొదటి బస్సులో...."

"అయితే పదండి. నేనూ అటే వెళ్తున్నాను. మిమ్మల్ని క్షేమంగా బస్సులో ఎక్కించి మరీ వెళతాను" అన్నాడు రామనాథం అతడితో పాటు అడుగులు కలుపుతూ.

"పాపం.... మీరు బ్యాంకుకి వచ్చిన పని కానేలేదు. ఈ పూటంతా నాతోనే ఉండిపోయారు" అన్నాడు పెద్దిపంతులు.

"ఆ! దానికేముందిలెండి. మీ పనే నా పని.... నా పని కేముంది? ఈ రోజు కాకుంటే మరోనాడు చూసుకొంటాను. ఈ ఊళ్ళో ఉన్నవాడిని" అన్నాడు రామనాథం మీరేం బాధపడకండి అన్నట్లు.

పెద్దిపంతులుకు బస్సుస్టాండు దాకా తోడువచ్చి, అతడు బస్సులో కూర్చునేదాకా వెంట ఉండి, చేతి సంచి భద్రం అని ఒకటికి పదిసార్లు హెచ్చరించి మరీ వెళ్ళిపోయాడు రామనాథం.

దేవుడులా వచ్చి వేళకి సరిగా సహాయపడ్డ ఆ పెద్దమనిషికి మనసులోనే పదివేల నమస్కారాలు పెట్టుకొన్నాడు పెద్దిపంతులు. ఈ కాలంలోనూ ఉంటారు పరోపకార బుద్ధిగల మనుషులు. లేకుంటే ఈ రోజుల్లో తన పని మానుకొని ఎదుటివాడికి ఎవరు సహాయపడ్తారు అనిపించింది.

ఎలాగైతేనేమి చివరికి బస్సు బైలుదేరి నిండా అరమైలు నడచిందో లేదో 'ఏనుగు తోట' అంటూ ఒక కేక పెట్టటం, అక్కడ ఇద్దరు ప్రయాణీకులు దిగడం, ఒకడు ఎక్కడం జరిగిపోయింది.

ఆ ఎక్కిన ప్రయాణీకుడు మందిని తోసుకుంటూ ముందుకు వచ్చి పెద్దిపంతులు కూర్చున్న సీటులో ఒక పక్కగా కూలబడ్డాడు.

"ఏయ్.... నాయుడూ... ఆ పక్కకి పోయి కూర్చో" అన్నాడు పెద్దిపంతులు డబ్బు ఉన్న సంచిని గట్టిగా పట్టుకొంటూ.

"అయి ఆడోరి చీట్లండి.... పక్క టాపులో కాలేజీ అమ్మాయిలు పొలో పొలో అని ఎక్కిపోతారండి...."

"అవి ఆడవాళ్ళవి అయితే ఇంకో చోటు చూసుకో, నీకే చెప్తున్నది లే....లే... ముందిక్కడనుంచిలే" అన్నాడు పెద్దిపంతులు తను ఒక్క టికెట్టు కొన్నా పెద్దింటి ఆసామి కాబట్టి బస్సంతా తనదే అన్న ధోరణిలో.

"బాబ్బాయి.... రెన్నాల్లయి జరంతో సత్తున్నాను బాబూ! ఎక్కడా చీటు కాలీలేదు. నిలబడే శక్తిలేదు బాబూ. లేకుంటే తమలాంటి పెద్దోరి ప్రక్కన కూకుంటానా! తమకి తగలకుండా ఇలా ఇటు తిరిగి కూకుంటాను స్వామీ.... అబ్బెంతరం సెప్పకండి" అంటూ బ్రతిమాలుకొన్నాడు నాయుడు.

అతడి కళ్ళూ, ముఖం ఎర్రగా ఉన్నాయి. 'నిజంగా జ్వరంతో ఉన్నట్లే వుంది వాలకం. పోనీ పాపం.... ముసలాడు. ఆ చివర కూర్చోనీ' అనుకొన్నాడు పెద్ది పంతులు.

చిగురుపేట, చింతపల్లి దాటే వరకు అతడు అలాగే పొందిగ్గా ఓ మూలకి ఒదిగి కూర్చున్నాడు. సంగివలస దగ్గరికి వస్తుంటే మెల్లగా కళ్ళు మూసుకొని పెద్దిపంతులు మీదికి ఒరగడం ప్రారంభించాడు.

"ఏయ్ నాయుడూ! తిన్నగా కూర్చో!" అంటూ పెద్దిపంతులు ఒకటికి రెండుసార్లు అతన్ని హెచ్చరించాడు.

నాయుడు తుళ్ళిపడి కళ్ళు తెరచి, "చమించాలి బాబూ! కునికి పోనాను" అంటూ సర్దుకు కూర్చుని, మళ్ళా రెండు నిముషాలకే జోగడం మొదలుపెట్టాడు.

"పాపం జ్వర తీవ్రతవల్ల ఒళ్ళు వాడి స్వాధీనం లేకుండా పోయింది" అనుకొన్నాడు జాలిగా పెద్దిపంతులు.

ఉదయం ఎండలో తిరగడం, పైగా బస్సు ప్రయాణం. మరి కాస్త సేపు అలా కూర్చునేసరికి పెద్దిపంతులుకి కూడా కళ్ళు మూతలు పడ్డాయి. తిరిగి అతడికి తెలివి వచ్చేసరికి 'నరసరాయపురం' అని కేకలు వేస్తున్నాడు కండక్టరు. ఉలికి పాటుతో కళ్ళు తెరచిన పెద్దిపంతులు కంగారుగా సంచి కోసం చూసుకొన్నాడు. అది సురక్షితంగా అతడి చేతి పక్కనే ఉంది. ముందటేడు ఎల్లమ్మ జాతరలో కొన్న సంచి అది. జనపనారకి రంగువేసి, పువ్వులు, లతలు వచ్చేలా అల్లుతారు సంచుల్ని. అది నరసరాయపురం ప్రత్యేకత. ఎల్లమ్మ జాతరకి చుట్టుపక్కల ఊళ్ళ నుంచి వచ్చిన వారంతా విధిగా ఒక సంచి కొనుక్కుపోతుంటారు.

చేతిలో సంచి పట్టుకొని దారిన నడుస్తుంటే బస్సులో తన పక్క కూర్చున్న నాయుడు గుర్తుకు వచ్చాడు పెద్దిపంతులికి. తను దిగేసరికి వాడు పక్కన లేడు. మధ్యలో ఏదో గ్రామంలో దిగిపోయి ఉంటాడు. వాడు ఏదో ఊరు పేరు చెప్పాడు కాని, తను సరిగా వినిపించుకోలేదు. యలమంద దాటే వరకు పక్కన కదులుతున్నట్లే అనిపించింది. మరి ఎక్కడ దిగిపోయాడో....!

సరి, వాడు ఎక్కడ దిగిపోతే తనకేంగాని, తను బయలుదేరిన పని సవ్యంగా పూర్తి చేసుకొని క్షేమంగా యింటికి చేరుకొన్నాడు. ఈనాటికి యిదొక ఘనకార్యం సాధించినట్లే అనుకొన్నాడు.

అతడు యిల్లు చేరేసరికి భార్యామణి, బావమరది కాఫీ టిఫెన్లు సేవించి కబుర్లు చెప్పుకొంటున్నారు.

"ఏమండోయ్ బావగారూ! ఏదో ఘనకార్యం సాధించుకొస్తామని బయలుదేరారట" అన్నాడు వీరభద్రుడు తమల పాకులు నమలగా ఎర్రపడ్డ నాలికతో పళ్ళ సందున యిరుక్కున్న చెక్కముక్కని బయటికి లాగడానికి ప్రయత్నిస్తూ.

"బయలుదేరడం కాదు. సాధించుకొచ్చాం" అన్నాడు పెద్దిపంతులు అతి హుందాగా వాలుకుర్చీల నడుం వాలుస్తూ.

"నిజంగా?" అంది సుబ్బలక్ష్మి నమ్మలేనట్లు.

"అబద్ధాలు చెప్పడం మా యింటా వంటా లేదు."

"అక్కడికి మాయింట ఉన్నట్లు?"

"ఉందో, లేదో ఆ పెద్దమనిషిని అడుగు,తెల్లవారే సరికల్లా వచ్చి వాలుతానన్న మనిషి..."

"ఏం చెయ్యను బావా! మీ చెల్లెలు కాఫీ యిచ్చేసరికి మొదటి బస్సు తప్పిపోయింది. రెండో దానిలో బయలుదేరితే దాని టైరు పంచరు.... ఇంతకీ నువ్వు యిలా వెళ్లేవో లేదో నేనూ వచ్చాను. వెంటనే బయలుదేరబోతుంటే 'ఈపాటికి పట్నం వెళ్ళి ఒక ఘనకార్యం చేసుకురావాలని ఆయన ఎంతో ముచ్చటపడి బయలుదేరారు. నువ్వు నక్షత్రకుడిలా వెంటపడి ఆయన సంతోషాన్ని తగలెయ్యకు' అని అక్కయ్య కదలనివ్వలేదు."

"వాడి మాటలు నమ్మారు కనుక?.... ఇప్పుడే అరగంట కిందట వచ్చాడు. ఏదో అర్జంటు పని ఉందని ఆఫీసరు కదలనివ్వలేదట" అంది సుబ్బలక్ష్మి.

"సర్లే, నే చెప్పాగా కోడి కొండెక్కి కూర్చుంటే ఊరు తెల్లారడం మానేయదని..."

"అంటే... నిజంగా మీరు సొమ్ము తీసుకువచ్చారన్న మాట?"

"ఏం నమ్మలేక పోతున్నావా? నీ కళ్ళతో నువ్వే చూడు. అప్పటికైనా నమ్మకం కలుగుతుందేమో?" అంటూ పెద్దిపంతులు సొమ్ము పెట్టిన కవరు అందుకోవడానికి సంచిలో చెయ్యి పెట్టాడు. అంతలోనే కంగారుగా ఒకసారి సంచి లోపలికి తొంగి చూశాడు. చూసిందేతడవుగా కెవ్వుమని ఒక కేక పెట్టాడు.

"ఏమయింది బావా! సంచిలో సొమ్ము తేళ్ళు, పాములుగ మారిపోలేదు కదా!"

"ఒరేయ్ వీరిగా... నువ్వుండరా బాబూ! ఆయన దేనికో కంగారుతో హడలి చస్తుంటే..." అని తమ్ముని వారించి, "ఏమిటండీ! ఏమయింది?...." అంటూ భర్త దగ్గరికి వచ్చింది సుబ్బలక్ష్మి.

"ఏమయిందేమిటే? కొంప మునిగిపోయింది....." రెండు చేతులతో తల పట్టుకొని కూలబడ్డాడు పెద్దిపంతులు.

"ఏమయింది బావా?" ఆత్రంగా ముందుకి వస్తూ అడిగాడు వీరభద్రుడు.

"పోయిందిరా భద్రం! పాతిక వేల సొమ్ము చేయి దాటి పోయింది.'

"ఎలా పోయింది? ఎవరు తీసారు?"

"వాడేరా... ఆ నాయుడు! జ్వరం అంటూ వెధవ కబుర్లు చెప్పి పక్కన కూర్చున్నట్లే కూర్చుని...."

"వాడు పక్కన కూర్చున్నా సంచి మీ చేతిలో ఉండగా సొమ్ము ఎలా తీసాడండీ?"

"సొమ్ము కాదే.... సంచికి సంచే ఎత్తుకు పోయాడు."

"అదేమిటం.... మీకేమయినా మతిపోయిందా? ఆ సంచి మీదే! ఉదయం దీన్నే మీరు పట్టుకు వెళ్ళింది."

"చూసేందుకు నా సంచిలాగే ఉందే! కాని నాది కాదు. ఈ ఊర్లో దిగే ముందు కంటి మీదికి చిన్న కునుకు వచ్చింది. ఆ అవకాశం చూసుకొని వాడు సంచితో ఉడాయించాడు."

"ఎక్కడ దిగిపోయాడు?"

"తెలుస్తే విడిచి పెడ్తానా? వాడి పీక పిసికి బస్సులోంచి పైకి నెట్టేవాడిని. వెధవ అమాయకుడిలా జ్వరం గిరం అంటూ దొంగ వేషాలు వేసి...."

"ఇప్పుడవన్నీ అనుకొని ఏం లాభం? ముందు చెయ్యవలసింది ఏమిటో ఆలోచించాలి."

"నాకు మతి పోతున్నదిరా భద్రం! ఏం చెయ్యాలో నువ్వే చూడు."

"అన్నిటికన్నా ముందు పోలీసు రిపోర్టు యివ్వడం అవసరం. వాడు ఎలా ఉంటాడో! ఒడ్డు పొడుగు, కట్టు బొట్టు అన్నీ వివరంగా చెప్పు. యలమంద దాటే వరకు పక్కన ఉన్నట్లే ఉందన్నావు కాబట్టి, ఈపాటికి అట్టే దూరం పోయి ఉండడు. మన అదృష్టం బాగుంటే చోరీ సొమ్ముతోటే వాడు పట్టుపడవచ్చు" అన్నాడు వీరభద్రుడు.

పెద్దిపంతులు నాయుడి రూపురేఖల వివరాలన్నీ చెప్పాడు. వీరభద్రుడు వాటి నన్నిటిని రాసుకొని, "నువ్వు బ్యాంకుకి వెళుతున్నప్పుడు కాని, తిరిగి బయటికి వస్తున్నప్పుడు కాని అటువంటి వ్యక్తి చుట్టుపక్కల తచ్చాడ్డం చూసావా?" అంటూ ప్రశ్నించాడు.

"అలాంటిదేం జరుగలేదు. బస్సు కదలబోతుంటే వాడు వచ్చి నా పక్కన కూర్చునే దాకా నేను వాణ్ణి ఎక్కడా చూడలేదు" అన్నాడు పెద్దిపంతులు.

వీరభద్రుడు అలా అడుగుతుంటే తనకి బ్యాంకులో సహాయం చేసిన రామనాథం గుర్తుకొచ్చాడు. కాని అతడు పెద్దమనిషి. పుణ్యానికి పోతే పాపం వెంటపడింది అన్నట్లు అతన్ని ఈ కూపంలోకి లాగడం ఉచితం కాదనుకొన్నాడు. అంతేకాక ఒక్క నిముషం

కిందట బ్యాంకులోంచి తను స్వయంగా సొమ్ము డ్రా చేసి తెచ్చినట్లు భార్య ముందు గొప్పలు చెప్పాడు. ఇప్పుడు ఈ విషయం చెపుతే రేపు సొమ్ము దొరికిపోయినా మానినా యిదొక కథలా జీవితం పొడుక్కి మిగిలిపోతుంది. భార్యా, బావమరది అయినప్పుడు కానప్పుడు ఏడిపించుకు తింటారు. ఈ విధంగా ఆలోచించి రామనాథం విషయం ప్రస్తావించక పోవడమే మంచిది అన్న నిర్ణయానికి వచ్చాడు పెద్దిపంతులు.

కావలసిన వివరాలు అడిగి రాసుకొని పోలీసు రిపోర్టు యివ్వడానికి వీరభద్రుడు బయలుదేరి వెళుతుంటే ఆ వీధి చివరగా కనిపించాడు ఒక వ్యక్తి.

"బావా... బావా! ఓసారి యిలా రా!" అని ఒక పెద్ద కేక పెట్టాడు వీరభద్రుడు.

"ఏమిటిరా భద్రం! ఏమయింది?" అంటూ పెద్దిపంతులు, అతడి వెనుకనే సుబ్బలక్ష్మి వీధిలోకి వచ్చారు.

అప్పటికి ఆ వ్యక్తి మరికాస్త దగ్గరికి వచ్చాడు.

అతడిని చూసి పెద్దిపంతులు, "అదిగో వాడే.... వాడే... చంపేస్తాను... పీక పిసికేస్తాను...." అంటూ ఆవేశంతో ముందుకి దూకబోయాడు.

"వాడు నీ చేత పీక పిసికించుకోడానికి యింత దూరం రాలేదు కాని... కాస్త ఓపిక పట్టు!" అన్నాడు వీరభద్రుడు అతన్ని పట్టుకొని ఊపుతూ.

"అదిగో వాడి చేతిలో మీ సంచి ఉంది!" అంది సుబ్బలక్ష్మి.

"ఆc.... ఆc.... నిజంగానే!" నమ్మలేనట్లు సంచివైపు ఒకసారి చూసి మళ్ళా కళ్ళు నులుపుకొని యింకోసారి పరీక్షగా చూసి, "అవును నాదే... ఈ సంచి నాదే..." అన్నాడు పెద్దిపంతులు.

ఆ సరికి నాయుడు మరి నాలుగిళ్ళు ముందుకి వచ్చి అక్కడ గుమ్మంలో నిలబడి ఉన్నవారిని ఏమో అడుగుతున్నాడు. వాళ్ళు పెద్దిపంతులు నిలబడి ఉన్నవైపు వేలుతో చూపిస్తూ అతడికి జవాబు చెప్తున్నారు.

వారి మాటలు వినిందే తడవుగా అతడే గబగబ అడుగులు వేస్తూ ముందుకి వచ్చి "ఇదిగో బాబుగోరు! ఈడనే ఉండారు. ఈయేల నాకు లెగిసిన ఏల బాగుంది. అట్టే కవుకులు పడకండానే యిల్లు దొరికి పోనాది!" అన్నాడు సంతోషంగా.

"ఎవరు నువ్వు? బాబుగారితో నీకేం పని?" అన్నాడు వీరభద్రుడు వంట ఇంటి కుందేలు యింక ఎక్కడికి పోతుందిలే అన్న ధైర్యంతో.

"పనేటి నేదు బాబూ! ఓ సిన్న పొరపాటు జరిగిపోనాది. నాను తొందరలో మా ఊర్లో దిగిపోతూ నా చంచి అనుకొని బాబుగోరి చంచట్టుకొని దిగిపోనాను. ఇంటికాడ సూత్తును గందా, ఈ జలమలో ఎప్పుడూ సూడనంత సొమ్ము.... లబో దిబోమని బస్సుకాడికి లగెత్తుకొచ్చి పడ్డా. కాని ఏటి లాభం! బస్సెల్లి పోనాది. ఏటి సెయ్యడంరా భగవంతుడా

అని ఆలోసిత్తుంటే, 'పోలీసోళ్ళకి అప్పసెప్పెయ్ అన్నారు మా ఊరోళ్ళు. కాని ఈ జలమలో ఈయేల దాకా పోలీసోడి ముకం పట్టి ముకం సూడకుండా ఎల్లిపోయింది కాలం. ఆల్లపాల పడ్డామంటే ఆల్లు కాలికి యేత్తే మెడకి మెడకేత్తే కాలికి ఏసి నానాగడ్డీ తినిపిత్తారు.

"అంతలో ఆ బగమంతుడే నా బుద్ధిలో దూరి ఓ మంచి మాట తోపిచ్చాడు బాబూ! బాబుగోరు టిక్కెట్టు కోయిత్తూ కండట్టరయ్యతో నరసారామపురం అని సెప్పినట్టు గుత్తుకొచ్చింది. ఇంత పెద్ద బాబులు గందా పేరు తెలవకపోయినా పలాని యిదంగా ఉంటారని సెప్తే ఏరైన ఆరిల్లు సూపక పోతారా అన్న ధైర్యంతో ఎంటనే ఉంకో బస్సట్టుకొని యిలా దిగడ్డాను బాబూ!

"బస్సుస్టాండు కాడ ఓ కొట్టోడిని అడిగేతలికి 'ఓసీ ఆ బాబుని ఈ ఊర్లో తెలవనోరు ఏరోయ్' అంటూ దారి సెప్పేడు. పక్కల సేరి సొమ్ము కాసేసేడని బాబుగోరు ఎంతగ తిట్టుకొంటున్నారో అని సచ్చేంత బయంతో లగెత్తుకొచ్చి పడ్డా సామి!... దర్మ పెబువులు బాబుగోరు సెమించాలి. తమ కాల్లట్టుకొని సెప్తున్నాను. ఈ పని నాను సెయ్యాలని సేసింది కాదు.... దొంగబుద్ధి మా యింటా వంటా నేదు. ... నా బిడ్డల తోడు.... నా యింటి దాయి తోడు..."

నాయిడు అలా మాట్లాడుతుంటే పెద్దిపంతులు సుబ్బలక్ష్మి వీరభద్రుడు నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు... ముగ్గురిలో ఒక్కరి నోట కూడా ఒక్క మాటా రాలేదు.

"ఇందండి బాబూ మీ సొమ్ము, సరిగా ఉందో నేదో నెక్క సూసుకోండి!" అంటూ వాడు సంచిలోంచి నోట్లు పెట్టి ఉన్న కవరు తీసి అందిస్తుంటే పెద్దిపంతులు కళ్ళంట నీళ్ళు బొలబొల కారిపోయాయి.

"నాయుడూ! నీలాంటి మనుషులు ఇంకా యీ భూమి మీద ఉన్నారయ్యా! అందుకే ఈపాటిగానైనా వర్షాలు పడి పంటలు పండుతున్నాయి" అన్నాడు అతడి రెండు చేతులూ పట్టుకొంటూ.

"నాదేముంది బాబుగోరూ! తమ సొమ్ము తమకిస్తున్నాను కాని నా యింటికాడిది తెచ్చి పెట్టడం నేదుకదా! ఆ మాటకొత్తే మీరే నన్ను సెమించాలి.... ఎదవ పని సేసి తమర్ని కంగారెట్టేసి ఉంటాను" అంటూ ముఖానికి పట్టిన చెమటని తలగుడ్డ విప్పి తుడుచుకొంటూ, "నెక్క సూసుకోండి బాబూ!...." అన్నాడు నాయుడు.

పెద్దిపంతులు చేతిలోని నోట్లకట్ట అందుకొని వీరభద్రుడు ఒకటికి పదిసార్లు సొమ్ము లెక్క చూశాడు. రెండు వందల ఏభై కొత్త వంద రూపాయల నోట్లు చెక్కు చెదరకుండా ఉన్నాయి.

"అంతా సరిగా ఉంది బావా!" అన్నాడు వీరభద్రుడు ఆ నోట్ల కట్టని తిరిగి పెద్ది పంతులు చేతిలో పెడుతూ.

"మరి నాకు సెలవిప్పించండి బాబూ! ఒంటిలో బొత్తిగ సుకం నేదు. తిన్నగ యింటికి పోయి మంచాన పడి నడ్డి నేరేస్తేనే కాని...."

"పాపం యింత జ్వరంలో శ్రమపడి వచ్చావు" అంది సుబ్బలక్ష్మి సానుభూతిగా.

"నా సెమకేముందమ్మా! ఆ బాబు సొమ్ము ఆరికంద సేసేను. నా కదే పదేలు" అన్నాడు నాయుడు వినయంగా.

అందరికీ దండాలు పెట్టి అతడు వెళ్ళిపోబోతుంటే, "అంత సొమ్ము పువ్వుల్లో పెట్టినట్టు తెచ్చి అప్పగించాడు. వాడి కేదేనా యిస్తే బాగుంటుందేమో!" అంది సుబ్బలక్ష్మి మెల్లగా.

"అక్కయ్య అన్నమాట నిజమే బావా! నీతికి, నిజాయితికీ బహుమతి ఉండాలి. వాడికి ఏమైనా ఇయ్యి..." అన్నాడు వీరభద్రుడు.

పెద్దిపంతులు నాయుణ్ణి ఆగమని చెప్పి యింట్లోకి వెళ్ళి, సందుగ పెట్టిలోంచి మూడు పది రూపాయల నోట్లు తీసి వాటిని తెచ్చి నాయుడు చేతిలో పెట్టాడు.

"నాకియెందుకు బాబూ!" అన్నాడు నాయుడు పుచ్చుకోడానికి మొహమాట పడుతూ.

"డబ్బు ఎందుకు, అని అడుగుతున్న వాడిని నిన్నే చూసాను నాయుడూ!" అన్నాడు వీరభద్రుడు.

"నీ నిజాయితీకి బహుమతి" అంది సుబ్బలక్ష్మి.

"మనిషి నాయంగా ఉంటే ఆ బగమంతుడే బగుమతీ ఇత్తాడు తల్లీ! నాకేటీ నోటు నేదు...."

"అది సరే అనుకో.... అయినా మా సంతోషం కొద్దీ యిస్తున్నది. కాదనకు" అంటూ ఆ నోట్లు మడచి అతడి చేతిలో పెట్టాడు పెద్దిపంతులు.

అందరికీ మరోసారి దండాలు పెట్టి వెళ్ళిపోయాడు నాయుడు.

"కాణీ పరాకా కాదు ఇరవై అయిదు వేల రూపాయలు తెచ్చి చేతిలో పెట్టాడు. వాటిలో ఒక కాగితం తీసి యిస్తావనుకొన్నాను" అన్నాడు వీరభద్రుడు.

"ఏనాడూ అలవాటు లేని పని... చేతులు రావద్దూ" అంది సుబ్బలక్ష్మి ఈసడింపుగా.

"నువ్వు ఓ కాణీ అర్జించు.... సొమ్ము విలువ తెలిసొస్తుంది" అంటూ భార్యపై విరుచుకుపడ్డాడు పెద్దిపంతులు.

ఆ రోజు రోజంతా నాయుడి నిజాయితీ గురించి పెద్దిపంతులు, సుబ్బలక్ష్మి అడిగిన వారితో, అడగని వారితో చెప్పుకొని ముచ్చటపడ్డారు.

సాయంకాలం బంగారయ్య వచ్చి, చెయ్యవలసిన నగల వివరాలన్నీ సుబ్బలక్ష్మిని అడిగి రాసుకొని బయానాగా అయిదువేల రూపాయలు పెద్దిపంతులు దగ్గర పుచ్చుకొని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రెండు రోజులు పెద్దిపంతులు యింట జరిగిన కథ గ్రామంలో పిల్లా పెద్దా అంతా చెప్పుకోసాగారు. పెద్దవాళ్ళు పరామర్శగా యింటికి వచ్చి, నాయుడి మంచితనానికి కాసులిచ్చి, పెద్దిపంతులు అజాగ్రత్తకి హెచ్చరింప సాగారు.

ఈవిధంగా ఆదివారం, సోమవారం గడచి మంగళవారం వచ్చింది. పదకొండు గంటలవేళ పెద్దిపంతులు భోజనానికి లేవబోతుంటే బంగారయ్య తల్లి, పెళ్ళాం లబోదిబోమంటూ మొత్తుకొంటూ ఏడుస్తూ వచ్చి పడ్డారు.

"బాబుగారూ! తరతరాలుగా తమ యిల్లు నమ్ముకొని బ్రతుకుతున్నోళ్ళం.... ఇట్టా నట్టేట ముంచెత్తారనుకోఏదు దేవుడోయ్!" అంటూ రాగాలు పెట్టసాగారు.

"అసలేం జరిగిందో చెప్పకుండా ఏమిటర్రా ఆ యేడ్పులు?" అంది సుబ్బలక్ష్మి.

"అరిచ్చేందుదు నాటి నా కొడుకుని పోలీసోళ్ళు తీసుకు పోనారుట తల్లీ!" అంటూ గుండెలు బాదుకో సాగింది బంగారయ్య తల్లి రత్తాలు.

"పోలీసులా?.. ఎందుకు?... ఎవరు చెప్పేరు? అసలేం జరిగింది?" ఆత్రంగా ప్రశ్నించాడు పెద్దిపంతులు.

నిజంగా బంగారయ్యని పోలీసులు పట్టుకుపోయి ఉంటే తను యిచ్చిన సొమ్ము మాట ఏం కాను? నమ్మకస్తుడు, ఇంతప్పటి నుంచి తెలిసినవాడూ కదాని బయానాగా అయిదు వేలు యిచ్చినట్లు ఒక ముక్కైనా రాయించుకోలేదు.

"ఏటి జరిగిందంటే ఏటి సెప్పను తండ్రో... తమరిచ్చిన సొమ్మట్టుకొని బంగారం కొనాలని పట్నం పోనాడు. ఆ షావుకారు ఆ మాటా ఈ మాటా సెప్తా కూకుండపెట్టి, అయి దొంగనోట్లని పోలీసోళ్ళకి కబురెట్టినాట్ట. పోలీసుల ఎంట పోతూ బజార్లో సింగన్న కనిపిత్తే 'మా యమ్మతో సెప్పరా... నానేం పాపం ఎరగను. ఆ బాబు యిచ్చిన సొమ్ము అట్టగ పట్టుకొచ్చినాను. ఇయి దొంగ నోట్లు ఎట్టగ అవుతాయి. నిజం తెలిసేక ఆళ్ళే యిడిచి పెట్టేత్తారు... సిట్టిని, అమ్మని చెగిరి పోవద్దని సెప్పు' అన్నాట్ట. పెబువులు తమరు రచ్చించాలి బాబు!" అంటూ పెద్దిపంతులు కాళ్ళ మీద పడ్డాది రత్తాలు.

"నీకేం మతిపోయిందేమిటీ... ఆయన బ్యాంకు నుంచి తెచ్చి నీ కొడుకు చేతిలో సొమ్ము పెడితే అవి దొంగ నోట్లు ఎలా అయేయి. ఆ పట్నంలో నీ కొడుకు ఏం గడ్డి కరచేడో!" అంది సుబ్బలక్ష్మి.

"అమ్మో తల్లీ... అట్టాంటి మాటలనకు తల్లీ!.... నా యింటోడు దేవుడు తల్లీ!" అంటూ ఏడవసాగింది చిట్టి.

"నీ యింటోడు దేవుడు అయితే నా యింటోడేనా కానిది...."

"ఊరుకో సుబ్బులూ, వాళ్ళని ఏమీ అనకు!" అన్నాడు పెద్దిపంతులు దిగులుగా.

దేవుడు పంపినట్లు వచ్చి, వెంట ఉండి బ్యాంకులో సహాయపడ్డ రామనాథం, అంత సొమ్ముని పువ్వుల్లో పెట్టి తెచ్చి అప్పగించిన నాయుడు అతని కళ్ళ ముందర కదిలారు.

"అనకపోవడమేమిటండీ... మీరిచ్చినవి దొంగ నోట్లని వాళ్ళిద్దరూ అలా నోరెట్టుకొని అరుస్తుంటే..."

"ఆ మాట నిజమే కావచ్చు!"

"ఏమిటి... మీరు... మీరు..."

ఈసారి పెద్దిపంతులు పెళ్లాం దగ్గర ఏమీ దాచలేదు. జరిగింది జరిగినట్లు అంతా చెప్పాడు.

"మీరు చెప్పింది నిజంగా నా కర్థం కావడం లేదు. నిజంగా వాళ్ళు దొంగలే అయితే మళ్ళా సొమ్ము తెచ్చి ఎందుకు అప్పగిస్తారు?"

"ఎందుకేమిటి? మరి కాస్త సమయం కూడగట్టుకోడానికి. సొమ్ము పోయిందని మనం అప్పుడే పోలీసు రిపోర్టు యిస్తే వాళ్ళు పట్టుబడిపోయే ప్రమాదం ఉంది. ఇంక యిప్పుడా.... కావాలనుకొంటే యింకో దేశం కూడా వెళ్ళిపోవచ్చు" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన వీరభద్రుడు.

కథా నిలయం
శ్రీకాకుళం